సీసీఐ తుక్కు టెండర్‌ను అడ్డుకుంటాం

సీసీఐ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్, సీపీఎం నాయకులు

- సిమెంట్ పరిశ్రమ ఎదుట బీఆర్ఎస్, సీపీఎం, భూ నిర్వాసితుల ఆందోళన

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ తుక్కును ఈ టెండర్ కింద విక్రయించడానికి చర్యలు తీసుకుందని టెండర్‌ను అడ్డుకుంటామని గురువారం బీఆర్ఎస్, సీపీఎం, భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. సీసీఐ సాధన కమిటీ నాయకులు విజ్జగిరి నారాయణ, దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ.. మూతబడిన సీసీఐని తిరిగి ప్రారంభించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యహరిస్తుందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ పరిశ్రమను ప్రారంభించాలంటూ కేంద్రానికి పలు లేఖలు రాసినా, కేంద్ర మంత్రులను కలిసినా స్పందన లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం సీసీఐ పునరుద్ధరణ విషయం మర్చి తుక్కును విక్రయించడానికి రూ.48 కోట్లతో ఈ టెండర్‌ను పిలించిందని, యంత్ర సామగ్రిని తుక్కు కింద విక్రయించి విలువైన భూములను ఆదానీ కంపెనీలకు కట్టబెట్టడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐని ప్రారంభించాలని, లేనిపక్షంలో రైతులకు భూములు తిరిగి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ర రమేశ్, మెట్టు ప్రహ్లాద్, నవాతే శ్రీనివాస్, ఉదయ్ కిరణ్, సంతోష్, సీపీఎం నాయకులు బండి దత్తాత్రి పాల్గొన్నారు.

పంజేషాలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, అర కేజీ వెండి, రూ.40 వేలు చోరీ
- సీసీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషాలో గురువారం భారీ చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. బోంబిడిపల్లి నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 14 తేదీన హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ పని చేసుకుని తిరిగి గురువారం వచ్చే సరికి ఇంటి తాళం పగిలి ఉంది. ఇంట్లోని వస్తువులు, దుస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. కబ్‌బోర్డులో దాచి ఉన్న 12 తులాల బంగారం, ఆర కేజీ వెండి, రూ.40 వేల నగదు, సోనీ కంపెనీ టీవీ చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.9 లక్షల వరకు ఉంటుందన్నారు. ఇంటి పక్కనే ఉన్న సీసీ పుటేజీని పరిశీలించారు. గురువారం ఉదయం 2.56 గంటలకు ఒక వ్యక్తి ఇంటి పరిసర ప్రాంతం గోడ ఎక్కి ఇంట్లోకి చొరబడ్డాడు. తిరిగి ఉదయం 4.05 గంటలకు ఇంటి గోడ దూకి బయటకు వచ్చాడు. బాధితుడు వన్ టౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఇంట్లో చిందర వందరగా దుస్తువులు

తహసీల్దార్ల బదిలీలు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : ఆదిలాబాద్ జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లాలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పంచపూలను పదోన్నతిపై కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నాయబ్ తహసీల్దార్ కే రఘునాథ్‌రావును బేల తహసీల్దార్‌గా, మంచిర్యాల జిల్లాలో నాయబ్ తహసీల్దార్ గోవింద్‌ను ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్‌గా, మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్ శైలజను కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఇక్కడి సూపరింటెండెంట్ నలంద ప్రియను భీంపూర్ తహసీల్దార్‌గా, భీంపూర్ తహసీల్దార్ సత్యానారాయణను ఇచ్చోడకు, ఇచ్చోడ తహసీల్దార్ తుకారాంను సిరికొండ తహసీల్దార్‌గా నియమించారు.

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 19 : విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని డీఐఈవో రవీందర్ అధ్యాపకులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కళాశాలలో ప్రారంభమైన ఎంసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. అంతేకాకుండా అధ్యాపకులు నిత్యం సమయపాలన పాటిస్తూ కళాశాలకు హాజరుకావాలని సూచించారు. ఆయన వెంట డీఐఈవో కార్యాలయ సూపరింటెండెంట్ మోసిన్, కళాశాల ప్రిన్సిపాల్ సుపీల్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన డీసీఎస్‌వో

బియ్యాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో

బోథ్, సెప్టెంబర్ 19: బోథ్ మండలం కోట(కే) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, బోథ్ మండల ప్రత్యేకాధికారి వాజిద్ అలీ సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసిన బియ్యంలో నాణ్యత లేదని ఫిర్యాదు రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. బియ్యం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులకు వండి పెట్టొదని సూచించారు. వెంటనే బోథ్ ఎంఎల్ఎస్ పాయింట్ తరలించి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయిస్తామన్నారు. ఆయన వెంట డీటీ ఎన్ఫోర్స్‌మెంట్ జాదవ్ రామారావ్, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మెరుగైన విద్యను అందించాలి..

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

వంట మనుషుల హాజరును పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 19 : ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. గురువారం వడగం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్య, వైద్యం, భోజనం గురించి తెలుసుకున్నారు. అటెండెన్స్, నిత్యావసర వస్తువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

ఎదులాపురం, సెప్టెంబర్ 19: ఆదిలాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వర్ వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా ఓటర్ల సవరణ, అభ్యంతరాలపై పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చి మార్పులు చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26వ తేదీ వరకు మార్పులు చేర్పులకు అవకాశం ఉందని అన్నారు. రాజకీయ నాయకులు దగ్గర నుంచి అభ్యంతరం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీవో ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్ఆర్సీలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : రిమ్స్ ఆసుపత్రిలో కొనసాగుతున్న ఎన్ఆర్సీలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో కె.కృష్ణ అన్నారు. గురువారం రిమ్స్ ఆసుపత్రిలోని ఎన్ఆర్సీ, ఎస్ఎన్‌సీయూ, డైస్, టీ హబ్ కేంద్రాలను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా ఎన్ఆర్సీలో తల్లీబిడ్డలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎన్‌సీయూ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, పీవో డీటీవో నరేందర్ రాథోడ్ ఉన్నారు.

బాసర నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నవరాత్రోత్సవాల ఆహ్వాన గోడ పత్రికను విడుదల చేస్తున్న మంత్రులు

బాసర, సెప్టెంబర్ 19 : బాసరలో జరగబోయే దేవీ నవరాత్రోత్సవాల ఆహ్వాన గోడ పత్రికను గురువారం మంత్రులు ఆవిష్కరించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంత్ రావు, ఆలయ ఈవో విజయరామారావు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి

భూక్తాపూర్‌లో భగీరథ నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : పట్టణంలోని భూక్తాపూర్‌లో ఆరు నెలల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని, ఇప్పటికైనా సరఫరా చేయకపోతే కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తామని వార్డు కౌన్సిలర్ బండారి సతీష్ అన్నారు. ఈ విషయంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ ఈఈ గంగాధర్, వాటర్ గ్రిడ్ ఈఈ గోపిచంద్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌లు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం అధికారులు భూక్తాపూర్‌లో తనిఖీలు చేపట్టారు. నీటి సరఫరా, పాత మున్సిపల్ నల్లా కనెక్షన్, డ్యామేజ్ అయిన పైప్‌లైన్లను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నారు.

వంద శాతం అక్షరాస్యత సాధించేలా చూడాలి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 19 : నిర్మల్ జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమ అమలుపై గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్షరాస్యత శాతం 57.77 కాగా, రాష్ట్రంలో నిర్మల్ జిల్లా 27వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. మండలాల వారీగా జిల్లాలో 13,563 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రాజేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, లైజన్ అధికారి మూర్తి, కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్చేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగు పెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుట్‌లెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కురించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య

టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంకర్‌ప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంకర్‌ప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కస్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్ పుజోల్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సీఎంను అభినందించారు. స్పెయిన్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

భారత్‌పై ఫెడ్ ప్రభావమెంత!

అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

ముంబై, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగారం ధరలు పెరుగవచ్చని అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ.. బెంచ్‌మార్క్ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.75-5 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మునుపు ఇది 5.25-5.50 శాతంగా ఉండేది. గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించేందుకు వరుసగా 14 నెలలపాటు 20 ఏండ్ల గరిష్ఠ స్థాయిలోనే కీలక వడ్డీరేటును అగ్రరాజ్య సెంట్రల్ బ్యాంక్ ఉంచింది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఊహించిందే. బంగారం ధరల్లో పెరుగుదలకు, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులపై లాభాల తరుగుదలకు ఈ నిర్ణయం దారితీయవచ్చు' అని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు సంజీవ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు. అలాగే ఫెడ్ నిర్ణయంతో పెట్టుబడులన్నీ స్టాక్ మార్కెట్ల నుంచి పసిడి వైపునకు మళ్లీ ధరలు కొత్త రికార్డులకు చేరవచ్చని కామా జ్యుయెల్లరీ ఎండీ కొలీన్ షా అభిప్రాయపడ్డారు. అయితే భారత్ వంటి దేశాల్లో సెంట్ర